# రామానుజాచార్యులు

కాంతిమతీ శూరకేశుల పుత్రుడు రామానుజాచార్యులు. విష్ణువు సర్వవ్యాపకుడని యెరిగిన వారు వైష్ణవులని చాటెను. అనగా దైవము సర్వవ్యాపకుడను భావముతో ఆరాధన సలుపువారే నిజవైష్ణవులని నిరూపించెను. నష్టకష్టనిష్ఠూరములను సుఖదుఃఖ సదుపాయములున్ను బుద్ధిని, అభివృద్ధి పరచు పరికరములని బోధించెను. కష్టములకు కృంగక, సుఖములకు పొంగక, దృష్టిని విష్ణుమయమొనర్చుట సూక్ష్మమార్గమనియు, జీవేశ్వర ప్రకృతులు మూడుగయున్నను, మూడును ఒకదాని ననుసరించి మరొకటి ఆధారపడియున్నవని ఆదర్శరీతిగా నిరూపించెను. ఆయా రూపనామముల ననుసరించి దేనిని యేరీతిగా అనుభవింపవలెనో దానిని ఆ మార్గములోనే వినియోగించవలెననియు, వాటికి తగిన కర్మ నిష్ఠ నీమములను కొన్నిటిని హద్దుగా నియమించిన గమ్యమును చేరవచ్చునని తెలిపెను. అనగా మొదలు వృక్షమున పుష్పముగ పుట్టి అదే కాయగా మారి తదుపరి ఫలమగుచున్నది. అయితే, ఒకే పదార్థము కాలానుగుణ్యముగ రూప నామములు మారుననియు, పుష్పమును పుష్పముగనే, కాయను కాయగనే, ఫలమును ఫలముగనే వినియోగించుటకు వీలుకాదని అతని భావము. ప్రకృతి పుష్పము. జీవుడు కాయ. ఈశ్వరుడు ఫలమన్న ధోరణిలో వైష్ణవ సిద్దాంతమును నిరూపించెను. ఇతను స్థాపించిన మతమునకే 'విశిష్టాద్వైత'మని పేరు.

ఇతను కాంతిమతీ సూరకేశవులయొక్క ముద్దుబిడ్డడు. ఇతను భక్తియే ఆధారమని, భక్తిలేక భగవంతుని పొందుట అసాధ్యమని, అతను సేవ్యుడని, మనము సేవకులమని ఈరకమైన భావాన్ని తాను ఆధారం చేసుకొని భక్తిమార్గమును చాటుతూ ఈ విశిష్టమైన అద్వైతమునకు కొంతవరకునూ పూనుకుంటూ వచ్చాడు. దీని గమ్యము ఒక్కటేయని, దీని పుట్టుకస్థానము ఒక్కటేయని మధ్యలో రెండుగా ఏర్పడినటువంటిదని, సేవకుడనేవాడు ప్రవాహమువంటివాడని, పరమాత్ముడు సముద్రమువంటివాడని, తనయొక్క గమ్యమైన సముద్రమును చేరే నిమిత్తమై తాను ఈ భక్తిమార్గమును అవలంబించి, తద్వారా ఆ ఆత్మతత్త్వములో లీనమొనర్చుకొనే ప్రయత్నమునకు పూనుకొనుటయే ఇతనియొక్క ప్రచారము.

లోతుగా విచారించినపుడు ఇదికూడను ఒకవిధమైన అద్వైతమునకే చెందుతుంది. ప్రవాహము ఎక్కడనుండి వచ్చినది. వర్షబిందువులనుండి వచ్చినది. వర్షబిందువులు ఎక్కడనుండి వచ్చినవి? మేఘములనుండి వచ్చినవి. మేఘములు ఎక్కడనుండి ఉద్భవించినవి? సముద్రమునుండి ఉద్భవించినవి. కనుక, దీని అంతరార్థము మనము విచారించినపుడు సముద్రమునుండి ఉద్భవించిన ఈ జలము తిరిగి ప్రవాహరూపములో వెళ్ళి సముద్రములోనే లీనమవుతుంది. ఇదికూడను ఒక విశిష్టమైన అర్థమును అందించేదే. కనుక, దీనికి విశిష్టాద్వైతమని పేరు పెడుతూ వచ్చారు. మన స్వస్థానమైన సాగరమును చేరాలంటే ప్రేమ అనే ప్రవాహమే సముద్రమునందు చేర్చగలుగుతుంది.

ఇట్టి ప్రేమనే పవిత్రమైనటువంటి రీతిగా భక్తి అని పిలుస్తూ వచ్చారు. నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన ప్రేమనే భక్తి అని పిలుస్తూ వచ్చారు. భగవంతుని తప్ప అన్యవిషయములను ఆశించని దానిని భక్తి అని పిలుస్తూ వచ్చారు. కనుక, తన నిమిత్తమై తాను ఆశించేటువంటి దానినే ప్రేమ అని పిలుస్తూ వచ్చారు. లోకనిమిత్తముగాని, వస్తువాహన నిమిత్తముగాని, ఇంకే విధమైన సౌఖ్యసంతోష సదుపాయాముల నిమిత్తముగానీ ఆశించేటువంటిది కాదు. తానే దైవమని అద్దములో తన ప్రతిబింబాన్ని చూచి ఆనందించినట్లుగా, భగవంతునియందున్న తన ప్రతిబింబాన్ని చూచి ప్రేమించుటయే భక్తి అని పిలుస్తూ వచ్చారు. కనుక, రామానుజాచార్యులవారు భక్తికి ప్రాధాన్యమిచ్చి తద్వారా లోకమంతా కూడను భక్తిని ప్రసరింపచేస్తూ చాటుతూ వచ్చారు.

రామానుజాచార్యులు తన గురువు వద్దనుండి దీక్షతో నారాయణ మంత్రోపదేశమును పొందాడు. నారాయణ మంత్రమును ఉపదేశించిన తరువాత గురువు, 'ఈ మంత్రము మోక్ష ప్రదాయిని. దీనిని ఇతరులకు చెప్పవద్దు. ఇది నా ఆజ్ఞ' అన్నాడు.

రామానుజులు తనకు ప్రాప్తించిన మోక్షమార్గమును అందరికీ తెలియజెయ్యాలి అని నిర్ణయించారు. సమీపములోనున్న గుడిగోపురమెక్కి, 'ప్రజలారా! రండి, మోక్షమార్గమును తెలియజేస్తాను' అని అందరిని యెలుగెత్తి పిలిచారు. ప్రజలందరూ గోపురమునకు ముందు చేరారు. గురువుగారికి ఈ విషయము తెలిసింది. 'గురువుయొక్క ఆజ్ఞను ధిక్కరిస్తావా! నిన్ను శపిస్తాను' అని ఆగ్రహ, ఆవేశాలతో పలికాడు. రామానుజులు పరమ శాంతముగా, 'స్వామీ! శపించండి. నేను ఎటువంటి శిక్షనైనా అనుభవించటానికి సిద్ధమేకాని, నాకు ఎంతో ఆనందము కలిగించిన విషయం, నా వలన వేలాదిమంది భక్తులు మోక్షమును పొందే అర్హతను అందుకోగలిగినారన్నదే. ఇంక నేను ఏమైపోయినా పరవాలేదు' అన్నాడు. వినయపూర్వకంగా నమస్కరించాడు. గురువుగారు పరమానందముతో, 'నాయనా! గురువుకు తగిన శిష్యుడని నిరూపించుకున్నావు' అని ప్రశంసించాడు.